రూ.5 భోజన భవనాల ప్రారంభమేదీ?



ధర్నాచౌక్ వద్ద ఐదు రూపాయల భోజనం పెడుతున్న తాత్కాలిక ఆహార కేంద్రం



ఐదు రూపాయల భోజన పథకం కోసం నిర్మించి ప్రారంభానికి నోచుకొని కేంద్రం

- ప్రారంభానికి ముందే శిథిలావస్థకు
- నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం
- రేకులు విరిగిపోయి
- ధ్వంసమై సీలింగ్, ఫ్యాన్లు, లైట్లు

కవాడిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదు రూపాయల భోజన పథకం కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నేటికి ప్రారంభం కాలేదు. దీంతో భవనం శిథిలావస్థ చేరుకుంది, కాంట్రాక్టర్ నిరక్ష్యం, అధికారుల ఉదాసీన వైఖరి వల్ల ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన ఐదు రూపాయల భోజనం పథకం కోసం ఏర్పాటు చేసిన భవనం ప్రారంభం కాకముందే శిథిలావస్థకు చేరుకుంది. జీహెచ్‌ఎంసీ, హరే రామ హరే కృష్ణ సంస్థల ఒప్పందంతో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇందిరాపార్కువద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డబ్బాలో నాటి నుంచి నేటి వరకు ఐదు రూపాయల భోజన పథకాన్ని కొనసాగిస్తున్నారు. రోడ్లపై కాకుండా ప్రత్యేక షెడ్డులో భోజనం చేయాలని మూడు సంవత్సరాల క్రితం లక్షలు వెచ్చించి ఐదు రూపాయల భోజనం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో కరెంట్ కనెక్షన్ ఇంకా ఇవ్వలేదు. దీంతో స్టాల్ నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో రేకులు విరిగి పోయి సీలింగ్ విరిగి ఫ్యాన్‌లు, లైట్లు ధ్వంసమయ్యాయి. దాదాపు 300 మందికి పైగా నిరుపేదలు ప్రతిరోజు ఇందిరాపార్కువద్ద ఐదు రూపాయల భోజనం పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో ప్రారంభించక ముందే భవనం రేకుల షెడ్డు కింద ఉన్న సీలింగ్ కూలిపోతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భోజనం స్టాల్‌కు కాంట్రాక్టర్ చేత మరమ్మతులు చేయించి ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించి ప్రారంభించాలి



మూడు సంవత్సరాల క్రితం ఇందిరాపార్కువద్ద ఐదు రూపాయల భోజనం పథకం కోసం భవన నిర్మించారు. నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో రేకులు కూలిపోయి, సీలింగ్ విరిపోయి ఫ్యాన్లు, లైట్లు పూర్తిగా విరిగిపోయాయి. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని మరమ్మతులు చేయించి భవనాన్ని ప్రారంభించాలి.

జి. వెంకటేష్, బీజేపీ నాయకుడు

పాత డబ్బాలోనే కొనసాగిస్తున్నాం

ఇందిరాపార్కు వద్ద ఐదు రూపాయల భోజనం కోసం భవనం నిర్మించారు. కాంట్రాక్టర్ మాత్రం నిర్లక్ష్యంగా నిర్మాణాలు చేపట్టారు. పైన రేకులు విరిగిపోయి కింద ఏర్పాటు చేసిన సీలింగ్ విరిగిపోయింది. పాత డబ్బాలోనే భోజనాలు పెడుతున్నాం. కాంట్రాక్టర్ మరో రెండు చోట్ల ఏర్పాటు చేసిన భవనాలు ప్రారంభం కాకముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- చాణక్య, హరేరామహరేకృష్ణ సంస్థ ప్రతినిధి



రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కలిసి సన్మానిస్తున్న అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి తులసి శ్రీనివాస్, రవికుమార్ తదితరులు

బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రాష్ట్ర ప్రభుత్వం 100 కోట్ల నిధులు మంజూరు చేయడాన్ని పురస్కరించుకుని మంగళవారం అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి తులసి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవి కుమార్‌ల ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మంత్రిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమ పరిషత్‌కు వంద కోట్లు సీఎం రేవంత్‌రెడ్డిచే మంజూరు చేయించడంలో మంత్రి శ్రీధర్‌బాబు కృషి ఎంతో ఉందన్నారు. విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరామన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పోచంపల్లి శ్రీధర్‌రావు, నందిరాజు లక్ష్మీనారాయణ, మంగు రాఘవరావు, బాల శ్రీనివాస్, విజయలక్ష్మి, శేషుకుమార్, రాజ్యలక్ష్మి, నరేందర్, నందకిషోర్‌జోషి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అహ్మద్‌నగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అహ్మద్‌నగర్ బస్తీవాసుల సమస్యలు పరిష్కరిస్తాం

- కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ అహ్మద్‌నగర్‌లో బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌లోని అహ్మద్‌నగర్, పటేల్‌నగర్‌లో ఆయన పర్యటించి బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ప్రజలకు మంచినీటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పటేల్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య త్వరలో పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ ఫూల్ గేట్ ముందు ఆందోళన చేస్తున్న సిద్ధార్థ, తదితరులు

స్విమ్మింగ్ ఫూల్‌ను వెంటనే తెరవండి

- బీఆర్‌ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్

అంబర్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని స్విమ్మింగ్ ఫూల్‌ను వెంటనే తెరవాలని డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ డిమాండ్ చేశారు. స్విమ్మింగ్ ఫూల్‌ను వెంటనే తెరవాలని డిమాండ్ చేస్తూ అంబర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు స్విమ్మింగ్ ఫూల్ గేట్ ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైన స్విమ్మింగ్ ఫైల్ ప్రారంభించకపోవడం దారుణమన్నారు. అధికారులు వెంటనే స్పందించి స్థానికులకు ఇబ్బందులు కలగకుండా స్విమ్మింగ్ ఫూల్‌ను వెంటనే ప్రారంభించాలని కోరారు.



తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ సభలో అభివాదం చేస్తున్న జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు. కన్వీనర్ వజీర్, జేఏసీ నేతలు

విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

- జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ వజీర్

కవాడిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లలో పనిచేస్తున్న దాదాపు 20 వేలమంది విద్యుత్ ఆర్టిజన్స్ కార్మికులను వారివారి విద్యార్హతలను బట్టి జేఎల్‌ఎం, జేపీఏ. జూనియర్ అసిస్టెంట్, సబ్‌ఇంజనీర్, ఆఫీస్ సబార్డినేట్‌గా కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఎ వజీర్‌లు కోరారు. మంగళవారం ఇందిరాపార్కువద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ నిర్వహించారు. ఈ సభలో ఆర్టిజన్స్ పెద్దసంఖ్యలో పాల్గొని తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈశ్వర్‌రావు. వజీర్‌లు మాట్లాడుతూ ఆర్టిజన్స్ కార్మికులను విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయడంతో ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకపోగా కార్మికులకు ఉద్యోగభద్రత ఏర్పడుతుందని ప్రభుత్వాన్ని కోరారు. విధినిర్వహణలో ఇప్పటికే సుమారు 3 వేల మంది ఆర్టిజన్ కార్మికులు విద్యుత్ ప్రమాదాలలో మృత్యువాత పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్, వెంకటేష్‌లు హాజరై మద్దతు ప్రకటించగా జేఏసీ కో చైర్మన్ నాగరాజు. నరేందర్, కో కన్వీనర్లు వెంకటేష్, కృష్ణమాచారి, తిరుపతి, నాయకులు చంద్రారెడ్డి, లింగం, మురళి, రఘునాథరెడ్డితోపాటు వందలాది మందివి ద్యుత్ ఆర్టిజన్స్ కార్మికులు పాల్గొన్నారు.



తులసీరాంనగర్(లంక)లో ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్

దోమల నివారణకు చర్యలు: కార్పొరేటర్

గోల్నాక, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లోని పలు బస్తీలలో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ రోగాల బారిన పడుతున్నారని కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు డివిజన్‌లో దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. మంగళవారం గోల్నాక డివిజన్‌లోని తులసీరాంనగర్(లంక) బస్తీలో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ పాదయాత్ర నిర్వహించి ప్రజలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఉద్యోగులకు

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

- ఆరు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలి
- గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి



తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్, తదితరులు

కవాడిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి ఆరు నెలలుగా పెండింగ్‌లో వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు. ధర్నాచౌక్ వద్ద చలో హైదరాబాద్ కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12769 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న 60 వేల మంది పంచాయతీ కార్మికులకు గత ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం పంచాయితీ కార్మికులకు వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విదానం రద్దు చేయాలని అన్నారు.

ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు జి. పాండు. ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతిరెడ్డి, మహిళా కన్వీనర్ పుట్టా యాదమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, అప్పిరెడ్డి, ఎన్. రాంచందర్, వెంకట్‌గౌడ్, దశరథ్, శంకర్, మల్లేష్, మాదవి తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీలో ఎన్నికలకు ముగిసిన నామినేషన్లు

- 27 విత్‌డ్రాలు
- ఏప్రిల్ 2న ఎన్నికలు





నామినేషన్ దాఖలు చేస్తున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్యానెల్ సభ్యులు, నాయిని నరసింహారెడ్డి ప్యానెల్ సభ్యులు

రాంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ ఎంప్లాయిస్ కన్స్యూజమర్ కోఆపరేటివ్ సొసైటీ వర్కర్స్ యూనియన్‌కు ఏప్రిల్ 2వ తేదిన ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ యూనియన్ కార్యాలయం ఆవరణలోని వీఎస్టీ కన్స్యూజమర్ సొసైటీకార్యాలయంలో సొసైటీ సభ్యులు నామినేషన్ వేశారు. ఎన్నికల అధికారిగా కో ఆపరేటివ్ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌లు నామినేషన్‌లు స్వీకరించారు. వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ప్రస్తుత అధ్యక్షుడు మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి సంజీవరెడ్డి ప్యానెల్ తరపున హబీబ్ షరీఫ్, ఎం. సత్యనారాయణ, జి. గౌరీశంకర్, టి. పాల్‌సింగ్, పి. నవీన్‌కుమార్, బి. రాహుల్, శ్యామ్‌కుట్టి, అజయ్, అభిషేక్, రాజశేఖర్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దివంగత హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి (వీఎస్‌ఆర్) ప్యానెల్ నుంచి అభిలాష్, శంకర్‌రావు., మహేష్‌కుమార్, ప్రమోద్‌రెడ్డి, ఎం. శ్రీకాంత్‌రెడ్డి, కె. అమిత్‌రావు. బి. నర్సింగ్ రాజ్, టి. ప్రదీప్‌యాదవ్, వి. నవీన్, కె. వేణు నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్యానెల్ తరఫున జి. సచిన్‌గౌడ్, కందుల మణికంఠ రెడ్డి, ప్రణయ్‌కుమార్, బండనవీన్,ఎం. కృష్ణారెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శివకుమార్ మాట్లాడుతూ, 27న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందన్నారు. సొసైటీకి 10 మంది డైరెక్టర్ల ఎన్నికల కోసం ఏప్రిల్ 2న ఎన్నికలు వీఎస్టీ యూనియన్ కార్యాయలయంలో జరుగుతాయని, అదేరోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెలువడతాయని తెలిపారు.



విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుప్రియ

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్

ముషీరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ విద్యార్థులకు సూచించారు. మొదటి దశలోనే ఇబ్బందులను గుర్తించి డాక్టర్లను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకుంటే కంటి సమస్యలు పరిష్కరించ వచ్చని ఆమె అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆర్‌బీఎస్‌కే సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ మాట్లాడుతూ ఈ రోజుల్లో కంటి చూపు సమస్య తీవ్రమైందని అన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పు ఎక్కువగా ఏ విటమిన్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పిల్లలు ఫోన్, టీవీలు ఎక్కువ సమయం చూడవద్దని పేర్కొన్నారు. దీనివల్ల కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రతన్, ఇస్మాయిల్, ఆర్‌బీఎస్‌కె సంస్థ డాక్టర్‌లు లారా, శ్రీదేవి, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది పెల్లీస్, విజయ్ కుమారి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ముషీరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి కాలనీ సంజీవ ఆంజనేయస్వామి దేవాలయంలో వేంకటేశ్వరస్వామి ఆలయ 2వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకోని స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జియర్ స్వామి, వేద పండితుల సారథ్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఆలయ కమిటీ నేతలు పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సీనియర్ నాయకుడు టింగి నవీన్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సీతామార్కండేయ, పుండరీకం, కోశాధికారి గడ్డం నవీన్ కుమార్, సలహాదారులు ఆర్ ఆంజనేయులు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న అతిథులు

గాయకుడు నాగేశ్వరరావు అభినందనీయుడు

చిక్కడపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బహుగళ గాయకుడు పేరి నాగేశ్వరరావు అభినందనీయుడని ప్రముఖ రచయిత, న్యూ ఇండియా ఆష్యూరెన్స్ కంపెనీ పూర్వ జీఎం హరికుమార్ అన్నారు. మంగళవారం ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్, విజయ క్రియేషన్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో పాత కొత్త పాటలతో సుమధుర సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంగీతపరంగా ఎందరో గాయకులకు తమ సంస్థ ద్వారా అవకాశాలు కల్పిస్తూ సామాజికపరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి దంపతులు ఆదర్శప్రాయులని ప్రశంసించి వారిని సన్మానించారు. భీమశంకరం, దేవి, సిండికేట్ బ్యాంక్ పూర్వ సీజీఎం కామేశ్వరరావు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు. గాయనీగాయకులు పలు గీతాలు ఆలపించారు.



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

డివిజన్ అభివృద్ధికి కృషి: కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ తెలిపారు. డివిజన్‌లోని సబర్మతీనగర్ బస్తీలో మంచినీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ మంగళవారం పర్యవేక్షించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రానున్న ఉగాది, రంజాన్ పండుగల లోపే బస్తీవాసులకు మంచినీటి సరఫరా అందించే విధంగా పనులు జరగాలని కార్పొరేటర్ పావని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కరపత్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న అరవింద్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం

- రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్

చిక్కడపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్తశుద్ధితో, అంకితభావంతో కృషి చేస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం ఎ బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షతన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ బహిరంగ సభాసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కరపత్రాలను ఆవిష్కరించిన అరవింద్‌కుమార్ మాట్లాడుతూ భారతీయులైన మనందరం మన రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైందిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భవిస్తామన్నారు. ఇటీవల పరిణామాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గం ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వి.డి కృష్ణ, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ జి. చంద్రకళ, రాష్ట్ర నాయకుడు, సీనియర్ అడ్వొకేట్ పాశం అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ వస్తువుల సరఫరా కోసం టెండర్

చిక్కడపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి అవసరమైన వస్తువుల సరఫరా కోసం ఓపెన్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆలయం వద్ద మాట్లాడారు. ఈనెల 28న దేవస్థానానికి అవసరమైన వస్తువుల సరఫరాకు సంబంధించి ఓపెన్ టెండర్ ఉంటుందని వివరించారు. కాగా అంతకు ముందు రోజు అంటే ఈనెల 27న ఆలయం హుండీ లెక్కింపు ఉంటుందని భక్తులు ఈ లెక్కింపులో పాల్గొనవచ్చునని ఆమె వివరించారు.



ప్రేమ్‌నగర్‌లో బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ప్రేమ్‌నగర్‌లో ఎమ్మెల్యే కాలేరు పాదయాత్ర

అంబర్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ప్రేమ్‌నగర్‌లో బస్తీవాసుల సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బస్తీలో ఉన్న అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు మైలారం రాజు, రామారావుయాదవ్, భాస్కర్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించండి: శ్రీకాంత్



శ్రీకాంత్

అంబర్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయవాదుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతుందని, వారికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని అంబర్‌పేటకు చెందిన యువ న్యాయవాది దేవరుప్పల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అంబర్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ న్యాయం కోసం పోరాటం చేస్తున్న న్యాయవాది ఇజ్రాయిల్‌ను హత్య చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం పక్షాన వాదించే న్యాయవాదులకు సమాజంలో రక్షణ లేకపోతే సామాన్యుడి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం అసెంబ్లీ సమావేశంలో తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

- కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం నింబోలిఅడ్డ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో ఉత్తర భారతీయులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 6న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ఈ శోభాయాత్ర ప్రారంభమై కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం వద్ద ముగుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శోభాయాత్రలో పాల్గొనాలని ఆమె సూచించారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భగవత్, వాసు, సంతోష్, సూరి, రవియాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు సత్కారం

సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి సన్మానిస్తున్న టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా సెల్ అధ్యక్షురాలు శంభుల ఉష్కశ్రీ

- రాంనగర్, ఆంధ్రజ్యోతి